పశువైద్యం.. ప్రాణసంకటం



శిథిలావస్థలో పండితాపురం పశు వైద్యశాల భవనం



కామేపల్లి పశు వైద్యశాల భవనం

శిథిలావస్థలో పశువుల ఆస్పత్రులు

- పెచ్చులూడి పడుతున్న కామేపల్లి, పండితాపురం ఆస్పత్రుల స్లాబ్‌లు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు
- ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన
- పశుసంపద తగ్గుతున్నా.. పట్టించుకోని పాలకులు

కామేపల్లి: మండలంలోని కామేపల్లి, పండితాపురం పశు వైద్యశాలలో విధులు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది భయపడుతున్నారు. పశువుల ఆస్పత్రి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో పశువైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరి భవన పైకప్పు పెచ్చులూడి పడుతుంది. పై కప్పు పెచ్చులూడి పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని వైద్యులు, సిబ్బంది జుక్కుతున్నారు.

యాంత్రీకరణ పెరగడంతో..

సుమారుగా పదేళ్ల నుంచి వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, వ్యవసాయ పనులు చేసే వారు తగ్గడం వల్ల పశుసంపదను కూడా రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. గతంలో ఇంటికి నాలుగైదు గేదెలు, రెండు జతల ఎడ్లు ఉండేవి. కొందరు ఆవులు సైతం పెంచేవారు. వ్యవసాయంలో యంత్రాల వాడకం విపరీతంగా పెరగడం, పశువుల పోషణ భారంగా మారడంతో పశుసంపద రానురాను తగ్గుతూ వస్తోంది. దీంతో ప్రభుత్వాలు సైతం పశువుల ఆస్పత్రులను సైతం పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మండలంలోని కామేపల్లి, పండితాపురం గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులు పశువులకు వైద్య సేవల కోసం ఈ ఆస్పత్రికి తీసుకొస్తారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో ఉండి విధులు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది జంకుతున్నారు. ఇకనైనా నూతన భవనాలను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.



పండితాపురం పశు వైద్యశాలలో పెచ్చులూడిన దృశ్యం

కూలిపోయేలా ఉంది..



పశువుల ఆస్పత్రి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఆస్పత్రి ఎప్పుడు కూలుతుందో తెలియదు. కొత్త భవనానికి నిధులు మంజూరు చేసేంత వరకు ఇతర భవనంలోకి మార్చాలి. లేకుంటే ఆకస్మికంగా కూలిపోయి ప్రాణాపాయం సంభవించొచ్చు. అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలి.

– జర్పుల రామారావు, రామకృష్ణాపురం, రైతు

పట్టించుకోవడం లేదు..



పశు వైద్యశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పై పెచ్చులూడి పడడమే కాదు భవనం పైకప్పు ఎప్పుడైనా కుప్పకూలే ప్రమాదం ఉంది. తక్షణమే మరో భవనంలోకి వైద్యశాల మార్చాలి. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగగ ముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– ఉప్పుగండ్ల వీరభద్రరావు, పండితాపురం

ఘనంగా ఆదివాసీ దినోత్సవం




కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆరెం రవి

కామేపల్లి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అన్ని గ్రామాల్లో ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని మద్దులపల్లి ఊటవాగు గుట్టపై ఆదివాసీ సంఘ రాష్ట్ర నాయకులు ఆరెం రవి, ముక్తి సాంబశివరావు ఆధ్వర్యాన వేడుకలను నిర్వహించారు. ఈమేరకు ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను పరిరక్షించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రాజ్యాంగబద్ధంగా గిరిజన చట్టాలను పరిరక్షించాలని పలువురు వక్తలు కోరారు. వీరనారీమణుల ఆశయ సాధన సమితి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గిరిజన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి మాట్లాడుతూ.. గిరిజన చట్టాలను నేడు కేంద్రంలోని పాలకులు తూట్లు పొడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షురాలు షేక్ నజీమా, సలహాదారులు పుల్లూరు నాగయ్య, ఝాన్సీ, స్పందన, లక్ష్మి, పార్వతి, నాగమణి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ భద్రునాయక్, వీరన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.


'ఫేమా' కన్వీనర్ తల్లి మృతిపై సంతాపం



పద్మావతి (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: ప్రైవేట్ విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ల అసోసియేషన్(ఫేమా) కన్వీనర్ ముష్వా శ్రీనివాసరావు తల్లి పద్మావతి(85) శుక్రవారం మృతి చెందారు. ఖమ్మంలో నివాసముంటున్న ఆమె అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, వివిధ పార్టీల నాయకులు బాగం హేమంతరావు, పోట్ల నాగేశ్వరరావు, విద్యాసంస్థల అసోసియేషన్ల బాధ్యులు కాంతారావు, ఎం.వీరారెడ్డి, కాటేపల్లి నవీన్‌బాబు నివాళులర్పించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన పెనుబల్లి మండలం లంకపల్లికి తీసుకెళ్లగా రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముష్వా విజయబాబు నివాళులర్పించగా పలువురు సంతాపం ప్రకటించారు.

జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం



ఖమ్మం మామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం / ఖమ్మం వైద్యవిభాగం: దశాబ్దకాలంగా జర్నలిస్టుగా పనిచేసిన ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్‌తండాకు చెందిన ఏలేటి వెంకటరెడ్డి మృతి చెందగా శుక్రవారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు అధ్యక్షతన ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు సభకు హాజరై వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ యూనియన్‌లో క్రియాశీలకంగా పనిచేసిన వెంకటరెడ్డికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం, ఇతర సాయాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు విజేత, టీఎస్ చక్రవర్తి, మందుల ఉపేందర్, జానీపాషా, యలమందల జగదీష్, నరేందర్, ఈశ్వరి, భారతి, కొరకొప్పుల రాంబాబు, అశోక్, శ్రీనివాస్, జీవన్‌రెడ్డి పాలకాలరావు, రమేష్, వెంకటకృష్ణ, హుస్సైన్, తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యాన వెంకటరెడ్డి భూమిని అదే గ్రామానికి చెందిన జాటోత్ వీరన్న కబ్జా చేశాడని గత ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగగా.. ఆస్పత్రిలో కేవలం ఫార్మసీ బిల్లు మాత్రమే తీసుకుని చికిత్స అందించిన ఖమ్మంలోని శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లుకు యూనియన్ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు టీఎస్ చక్రవర్తి, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు ముత్యాల కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి మూల జీవన్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి..

ఖమ్మంరూరల్: రైతు ఏలేటి వెంకటరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని న్యూడెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మంరూరల్ మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూకబ్జాలకు పాల్పడుతున్న వారి పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించకుండా చట్టపరమైన చర్యలు తీసుకుని ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు శీలం సుదర్శన్, ఉప్పలయ్య, డి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం/కామేపల్లి/నేలకొండపల్లి/ఖమ్మంవ్యసాయం: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా నేడు(శనివారం) ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని శుక్రవారం విద్యుత్ సెక్షన్ల ఏఈలు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. నగరంలోని బల్లేపల్లి సెక్షన్ పరిధిలోని పారిశ్రామిక ప్రాంత సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించబడుతుందని ఏఈ భాస్కర్ తెలిపారు. అలాగే రఘునాథపాలెం మండలం మంచుకొండ సబ్ స్టేషన్ పరిధిలో, రఘునాథపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈలు పి.సతీష్, ఏఈ ఇందిరా తెలిపారు. అంతేకాక కామేపల్లి మండలం ముచ్చర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల, సాతానిగూడెం, మద్దులపల్లి ఫీడర్‌లోని గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు.అలాగే నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ రామారావు తెలిపారు. అంతేకాక నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–5 ఏఈ జే ప్రభాకర్‌రావు తెలిపారు. బుర్హాన్‌పురం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో, గాంధీచౌక్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 33/11 కేవీ ఎస్ఎస్‌పీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈలు నాగేశ్వరరావు, ఎం. మాల్సిక, బి. తావుర్యా తెలిపారు. అలాగే ప్రకాష్‌నగర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం ఉంటుందని టౌన్–4 ఇన్‌చార్జ్ ఏఈ ఖదీర్ చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెకోడుతండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుగులోత్, కృష్ణ, బానోత్ శ్రీను, కిషన్‌రావు, హరిదాసు, ఎ.అశోక్‌నాయక్, ఎస్.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ కార్మిక వ్యతిరేకం



ఖమ్మంమయూరిసెంటర్: బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ అని, వెంటనే దాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు తోట రామాంజనేయులు, కల్యాణం వెంకటేశ్వరరావు, జి.రామయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాల నరేష్ నాయుడు అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని బైపాస్ రోడ్డులో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పోరాటాలు చేసిన రైతుల కన్నా.. కార్పొరేట్ శక్తులపై మోదీకి అమితమైన ప్రేమ ఉందని ఆరోపించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం పేరు చెప్పి ఏడాడి కాలంలో రూ.59 వేల కోట్లు రిలయన్స్ కంపెనీకి అప్పజెప్పారని వారు మండిపడ్డారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 లేబర్ చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లుగా మార్చితే కార్మికులకు జరిగిన నష్టాన్ని ప్రశ్నించే అవకాశం ఉండదన్నారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేసి పాత చట్టాలనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 14 వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మాదినేని రమేష్, తాటి వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, గాదె లక్ష్మీనారాయణ, పేరబోయిన మోహన్‌రావు, షేక్ ఇబ్రహీం, యర్రా శ్రీకాంత్, రావుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మంరూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు పి.మోహన్‌రావు మాట్లాడుతూ.. బడ్జెట్‌కు వ్యతిరేకంగా కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యాన క్విట్ ఇండియా దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. నేటి బీజేపీ ప్రభుత్వం స్వదేశీ, బహిష్కరణ విదేశీ వస్తువులను తలుపులు తెరిచి ఉంచిందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, రాములు, ధర్మేందర్, సైదులు, పద్మ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కూసుమంచి: కూసుమంచి నూతన సీఐగా నియమితులైన సంజీవ్, ఎస్సైగా నియమితులైన నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ జనార్దన్, ఎస్సై కిరణ్‌కుమార్ బదిలీ కాగా వారి స్థానాల్లో వీరు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

● **తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం నూతన ఎస్సైగా కూచిపూడి జగదీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన గిరిధర్ రెడ్డి మహబూబాబాద్ జిల్లా పెద్ద గూడురుకి బదిలీ కాగా తొర్రూరు నుంచి జగదీష్ ఇక్కడకు వచ్చారు.

మహేష్ బాబు జన్మదిన వేడుకలు



ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న అభిమానులు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంఅర్బన్: నగరంలో సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈనేపథ్యాన ఖమ్మం ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రి రక్తదాన కేంద్రంలో యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ పీవీ గణేష్, అభిమాన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం దాసరి ఫౌండేషన్ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహేష్ బాబు అభిమాన సంఘ ప్రతినిధులు రంగారావు, కిషోర్ బాబు, లక్ష్మణ్, బాలు, గురుమూర్తి, బ్రహ్మం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

తిరుమలాయపాలెం: కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం శుక్రవారం తిరుమలాయపాలెంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ.. వరదల్లో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, అందుకు విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెర్సుల వెంకటేష్, కొమ్ము నాగేశ్వరరావు, దిండు మంగపతి, పాపిట్ల సత్యనారాయణ, దేవసహాయం, స్వామి, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: పూలే, అంబేడ్కర్ అధ్యయన వేదిక ఆధ్వర్యాన ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించే సర్వాయి పాపన్న జయంతిని జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు. శుక్రవారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మందా రామారావు, అల్లిక వెంకటేశ్వరావు, బానోత్ భద్రూనాయక్, శ్రీనివాస్‌గౌడ్, రాంబాబు, విజయ్‌కుమార్, సోమరాజు, లింగబోయిన లక్ష్మణ్, మట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్'లో మాక్ పోలింగ్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల తరహాలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలను అభినందించారు. చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా సీనియర్ ఉపాధ్యాయుడు వీఎస్ఎన్ మూర్తి వ్యవహరించగా.. మెంబర్లుగా రాజ రాజేశ్వరి, వేణుగోపాల్, రామారావు, వెంకటేశ్వర్లు, దాసు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యాన వ్యక్తిత్వ వికాసంపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు సమీర్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, సీనియర్ లెక్చరర్ రాజ్యలక్ష్మి, లైబ్రేరియన్ రాజారత్నం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జంపాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'వికాస్' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్

ఖమ్మం సహకారనగర్: కరీంనగర్‌లో జీఆర్ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్, వరంగల్‌లో గురు షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన 9వ నేషనల్ షోటోకాన్ కరాటే చాంపియన్ షిప్‌లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని వికాస్ కిండర్ గార్టెన్ స్కూల్ కరస్పాండెంట్ వై.లావణ్య తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించాకఆమె మాట్లాడారు. కరాటే పోటీల్లో అండర్ 14 బాలుర విభాగంలో టి.రిషిక్ శ్రీహాన్ డమూల్ నాన్ చెక్ కటా, స్పేరింగ్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు, కుమిటే విభాగంలో ఎ.శ్రీహాస్ కాంస్య పతకం, అండర్–10 బాలుర విభాగంలో ఎ.శ్రీజిత్ వెండి పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన ఎల్‌ఓసీ చెక్కులను శుక్రవారం ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. కార్పొరేటర్ మలీదు జగన్, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాతా రఘురాం తదితరులు ఈ చెక్కులను అందించారు. కాంగ్రెస్ నాయకులు మూడు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఏదీ స్వచ్ఛదనం..?!



దొరన్న కాలనీలో..



దివ్యాంగుల కాలనీలో..

వానాకాలం సీజన్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'స్వచ్ఛదనం-పచ్చదనం'కార్యక్రమం చేపట్టింది. అయితే కొన్ని కాలనీల్లో మాత్రం అపరిశుభ్ర వాతావరణం ఇంకా దర్శనమిస్తూనే ఉన్నాయి. డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో దొరన్నకాలనీ, దివ్యాంగుల కాలనీల్లో నీరు రోడ్లపైనే నిల్వ ఉంటోంది. అయినా ఈ కాలనీలపై అటు అధికారులు, ఇటు పాలకులు దృష్టి సారించడం లేదు. - ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

పవిత్రోత్సవాలు ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ప్రాచీన దివ్య క్షేత్రం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం 17వ వార్షిక పవిత్రోత్సవాలను సంప్రదాయ పద్ధతిలో పండితులు ప్రారంభించారు. అంకురార్పణ, దీక్షా చరణ, విశేష పూజలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరి జగన్మోహన్ రావు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నూతన చర్చి..



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని టీఎస్‌జీఓస్ కాలనీలో నూతనంగా నిర్మించిన చర్చిని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్, మద్ది వీరారెడ్డి, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు.

సీమంతాలు.. అక్షరాభ్యాసాలు...

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముర్రుపాలు, తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు సామ్రాజ్యం,సుజాత, విజయలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను కాపాడుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను తరలించేందుకు గత ప్రభుత్వంలో అనేక కుట్రలు జరిగాయని, ఎన్నో పోరాటాలు, ఎంతో మంది సహకారంతో మార్కెట్‌ను కాపాడుకోగలిగామని సీపీఎం నాయకుడు యర్రా శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌ను త్రీటౌన్ ప్రాంతం నుంచి తరలించొద్దని నాడు కరపత్రం వేసినందుకు తనపై కేసు పెట్టారని, అయినా ఆ కేసుకు వ్యతిరేకంగా అనేక మంది పోరాడారన్నారు. రెండు రోజులుగా కేసును పరిశీలిస్తున్న న్యాయమూర్తి కొట్టివేశారని తెలిపారు. మార్కెట్‌ను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

రోడ్డుపై బురదలో నాట్లు వేసి నిరసన

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని గ్రీన్ కాలనీలో రోడ్లు బురదమయంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ శుక్రవారం స్థానికులు నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు షేక్ షరీఫ్ మాట్లాడుతూ రహదారిపై గుంతలు పూడ్చాలని ఎన్నిమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యాన ఇకనైనా స్పందించాలని డిమాండ్ చేశారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

తిరుమలాయపాలెం: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మహ్మదాపురం, మేడిదపల్లి, దమ్మాయిగూడెం గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలలో పాల్గొని పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నర్సింహారావు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి తపాలా సేవలు

నేలకొండపల్లి: గ్రామ గ్రామాన తపాలా సేవలను అందుబాటులోకి వచ్చాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సౌత్ సబ్ డివిజన్ ఐపీఓ కె.గోపినాథ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోరుట్లగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈమేరకు గ్రామీణ తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న ఇన్సూరెన్స్ పథకాలు, బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఎస్ పెరుగు నాగేశ్వరరావు, ఎం.లక్ష్మన్, ఎస్‌పీఎం వివేక్, తపాలా సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.